



సముద్రంలోని నీలిరేఖకూ ఆకాశంలోని ఉదయరేఖకూ మధ్య ప్రయాణిస్తూ ఓ ఓడ హారిజ్ రేవు చేరుకుంది. వెంటనే అందులోంచి ఈగల్లా జనం బయటికి రాసాగారు. వాళ్ళలో మనం అనుసరించవలసిన వ్యక్తి ఏ మాత్రం ప్రత్యేకంగా కనిపించడం లేదు.

ప్రత్యేకంగా కనిపించడం అతని ఉద్దేశం కూడా కాదు.

అయితే అతని గంభీరమైన మొహానికీ, పూల రంగడిలా వేసుకున్న దుస్తులకు మాత్రం ఎక్కడా పొంతన కుదరడం లేదు. గ్రేకలరు చొక్కా మీద తెల్లని వెయిస్ట్‌కోటు ధరించాడు. తలకు బుట్టలా అల్లిన హ్యాటు పెట్టుకున్నాడు. ఊదా రంగు రిబ్బనొకటి ఆ హ్యాటుకు విలాసంగా చుట్టుకుంది. అతని మొహం పల్చగా వుంది. చామన ఛాయ. చిన్న గడ్డం పెంచాడు. కాలరు ఎత్తుగా చెవుల్దాకా వుంది. పనీపాటా లేనివాడిలా ఫోజు పెట్టి సీరియస్‌గా సిగరెట్టు తాగుతున్నాడు. పైకి కులాసారాయుడిలా కనిపిస్తున్నా ఆ మనిషి తన చొక్కా లోపల లోడ్ చేసిన రివాల్వరు దాచుకున్నాడంటే అతన్ని చూసినవాళ్ళెవరూ నమ్మలేరు. అతని వెయిస్ట్‌కోటు ఓ పోలీసు కార్డునీ, అతని హ్యాటు ఐరోపా ఖండంలో కెల్లా మహా గట్టి బుర్రనీ కవర్ చేస్తున్నాయి.

అతనెవరో కాదు— వాలెంటిన్.

పారిస్ పోలీసులకు అత్యున్నతాధికారి.

ప్రపంచ ప్రఖ్యాతి పొందిన అపరాధ పరిశోధకుడు.

ఆ శతాబ్దంలో కెల్లా పెద్ద గజదొంగను పట్టుకోవడానికి అతను బ్రసెల్స్ నుంచి వచ్చి లండను వెళ్తున్నాడు.

ఫ్లాంబ్యూ ఇంగ్లాండులోనే వున్నాడు!

ఘెంట్ నుంచి బ్రసెల్స్‌దాకా, బ్రసెల్స్ నుంచి హాలెండ్ దాకా మూడు దేశాల పోలీసులు ఫ్లాంబ్యూని పట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నారు.

లండన్లో క్రైస్తవ మహాసభలు జరుగుతున్నాయి. ఆ మహాసభల సంరంభాన్ని ఫ్లాంబ్యూ తనకు అనుకూలంగా వినియోగించుకోగలడనే వూహాగానాలు సర్వత్రా వినిపిస్తున్నాయి. బహుశా ఆ మహాసభలకు సంబంధించిన ఓ ఉద్యోగిగా అతను చలామణీ అయిపోతుండవచ్చు. అయితే వాలెంటిన్ మాత్రం ఇంకా ఖచ్చితంగా ఏదీ వూహించలేక పోతున్నాడు. ఫ్లాంబ్యూ ఏ సమయంలో ఏ అవతారం ఎత్తుతాడో ఎవరూ వూహించలేరు.

ఫ్లాంబ్యూ చాలా కాలం క్రితమే ఎందుకో తన గజదొంగతనాలు అకస్మాత్తుగా మానేశాడు. అతను దొంగతనాలు మానేస్తూనే రాక్షస సంహారం తర్వాత భూలోకంలో వ్యాపించినంత శాంతి ఏర్పడిందని చెప్పుకుంటారు. గజదొంగగా అతను తన హయాములో జర్మనీ చక్రవర్తి అంతటి విశ్వవిఖ్యాత పురుషుడు. ఒకనేరానికి పట్టుబడకుండా తప్పించుకోవడానికి అతను సునాయాసంగా మరో నేరం చేసేవాడు. అతను చేసే అసాధారణమైన నేరాల గురించి వార్తా పత్రికలు దాదాపు ప్రతిరోజూ ప్రముఖంగా రాసేవి.

అతను బకాసురుడంతటి మహాకాయుడు. అన్నింటికీ తెగించిన మనిషి. అతని శక్తియుక్తుల గురించి రకరకాల కట్టుకథలు ప్రచారంలో వున్నాయి. బుర్రకు పదును పెట్టుకోవడానికి అతనోసారి బ్రహ్మాండమైన విద్యాదేవత విగ్రహాన్ని అమాంతం పైకెత్తేసి తలకిందులుగా నెత్తిన పెట్టుకుని మోశాట్ట. ఇంకోసారి తన వెంటబడ్డ పోలీసులిద్దర్ని రెండు చంకల్లో ఇరికించుకుని దౌడు తీశాట్ట. ఏమైనా, నేరాలు చేయడంలో అతను తన అద్భుతమైన శారీరక శక్తిని యథేచ్ఛగా? వినియోగించేవాడనడంలో సందేహం అక్కర్లేదు. అయితే అతనెప్పుడూ రక్తపాతానికి మాత్రం ఒడిగట్టలేదు.

అతను నిజంగా మహా తెలివితేటల్తో నేరాలు చేసేవాడు. అవన్నీ అరాకొరా దొంగతనాలు కావు, ఏకంగా నిలువుదోపిడే. మోసాలూ దొంగతనాలు చేయడంలో సరికొత్త పద్ధతులు కనిపెట్టాడతను. లండన్లో ఒకసారి టైరోలియన్ డైరీ కంపెనీ అనే బ్రహ్మాండమైన బోగస్‌కంపెనీ ఒకటి పెట్టాడు. తమాషా ఏమిటంటే ఆ పాలసరఫరా కంపెనీకి ఓ పాడికానీ, ఓ పశువుకానీ, ఓ వాహనం కానీ, కనీసం ఓ గ్లాసుడు పాలుగానీ ఏవీ వుండేవి కావు. అయినా వేలకొద్దీ కస్టమర్లు మాత్రం వుండేవారు. సింపుల్‌గా ఒకింటి ముందర పాలసీసా తన కస్టమరు ఇంటిముందుకు మార్చేయడమే అతను చేసిన పాలసరఫరా.

అతని ప్రయోగాలన్నీ సింపుల్‌గానే వుండేవి. ఓసారి ఓ బాటసారిని బోల్తా కొట్టించడానికి రాత్రికి రాత్రి ఓ వీధిలో డోర్ నెంబర్లన్నీ మార్చేసి పెయింటుతో తిరగరాశాడంటారు. ఇంకోసారి మారుమూల వీధుల్లో దొంగ పోస్టు బాక్సులు ఏర్పాటు చేసి జనం వాటిలో వేసే పోస్టల్ ఆర్డర్లని టోకుగా తస్కరించాట్ట.

అంతటి మహాకాయుడైనా తూనీగలా పారిపోగల చాకచక్యం అతని సొమ్ము. చెట్టు కొమ్మల్లోకి మిడతలా ఎగిరి వానర ప్రముఖుల్లా ఇట్టే అదృశ్యమైపోవడం అతనికి వెన్నతో పెట్టిన విద్య. అందుకనే అతన్ని పట్టుకోవడానికి బయల్దేరిన వాలెంటిన్‌కు, అతనెక్కడవున్నాడో తెలుసుకోగలగడంతోనే తన సాహసయాత్ర సమాప్తమైపోదని బాగా తెలుసు. ఫ్లాంబ్యూని పట్టుకోగలగాలంటే మాటలు కాదు.

అయినా అతనెక్కడున్నాడో తెలుసుకోవడమే తను మొట్టమొదట చేయాల్సిన పని. కానీ, ఎలా? ఆ విషయమై వాలెంటిన్ ది గ్రేట్ ఇంకా ఆలోచించుకుంటూనే వున్నాడు.

మారువేషాలు వేయడంలో ఫ్లాంబ్యూ ఎంతటి ఘనుడైనా ఒక్క విషయంలో మాత్రం అతనెవరి కళ్ళూ కప్పలేడు. అతని ఒడ్డూ పొడుగు విషయంలో! వాలెంటిన్ చురుకైన కళ్ళకు అంతెత్తున ఒక స్త్రీ కనిపించినా సరే, వెంటనే అరెస్టు చేసేయడానికి సిద్ధంగా వున్నాడు. అయితే అంతెత్తుగా వున్న వాళ్ళెవరూ అతనికి ఓడలో తారసపడలేదు.

ఓడ దిగేశాక అతను రైలెక్కి బయల్దేరాడు. అతని వెంట ఆ పెట్టెలో కేవలం ఆరుగురు మాత్రమే ప్రయాణిస్తున్నారు. ఆరుగురూ పొట్టివాళ్ళే. జిరాఫీ ఎంతైనా పిల్లివేషం వేయలేదు గదా.

ఆ ఆరుగురు ప్రయాణీకుల్లో ఒకతను రైల్వే అధికారి. ఆవల టర్మినస్‌దాకా ప్రయాణిస్తున్నాడు. ముగ్గురు తోటపనివాళ్ళు. రెండు స్టేషన్ల తర్వాత వాళ్ళు దిగిపోతారు. అయిదో ఆవిడ విధవరాలు. ఎసెక్స్ ప్రాంతంలోని ఏదో చిన్న పూర్ణించి ఎగువకు వెళ్తోంది. పోతే ఇక మిగిలిన పెద్దమనిషి మరీ పొట్టిగా వున్న ఓ రోమన్ కేథలిక్ ఫాదరు. ఆయనా ఎసెక్స్‌లోని ఓ పల్లెటూర్ని నుంచి ఎగువకే ప్రయాణిస్తున్నాడు.

ఆ చివరి శాల్తీని చూస్తూనే వాలెంటిన్‌కు నవ్వొచ్చింది. ఆ ఫాదరీ పాపం మరీ పప్పుసుద్దలా వున్నాడు. పిడకలా గుండ్రంగా వున్న ఆ మొహంలో ఏకోశానా తెలివనేది కనిపించడంలేదు. కళ్ళు గాజుల్లా శూన్యంగా వున్నాయి. వళ్ళో బోలెడు బ్రౌను పేపరు పార్శిళ్ళు పెట్టుకున్నాడు. వాటిని సరిగ్గా పట్టుకోవడం కూడా అతనికి చేతకావడం లేదు.

ఇలాంటి వెర్రి వెంగళప్పలు కాకపోతే ఆ మహాసభలకు వెళ్ళేవాళ్ళెవర్లే అనుకున్నాడు వాలెంటిన్. అతను నాస్తికుడు. మతగురువులంటే అతనికి సరిపడకపోయినా వాళ్ళని చూసి జాలిపడగల హృదయం అతనికుంది. ఈ శాల్తీని చూస్తే ఎవరికైనా జాలి పుట్టకమానదు. అతని దగ్గరున్న పెద్ద గొడుగు మాటిమాటికీ కిందపడిపోతోంది. కనీసం తను కొన్న టిక్కెట్టు ముక్క ముందు వెనకలేవో కూడా అతనికి సరిగ్గా తెలిసినట్టులేదు.

తన పార్శెళ్ళలో నీలాలు పొదిగిన వెండి వస్తువొకటుందనీ, అందుకని తను చాలా జాగ్రత్తగా వుండాలనీ దద్దమ్మలా అందరికీ బాహాటంగా చెప్పేస్తున్నాడతను. అతని అమాయకత్వం చూస్తుంటే వాలెంటిన్‌కు వినోదంగా వుంది.

టాటెన్‌హామ్ వచ్చాక ఆ ఫాదరీ ఎలాగో తిప్పలుపడి తన బ్రౌన్ పేపరు పార్శిళ్ళు కిందికి దించుకోగలిగాడు. గొడుగు కోసం అతను తిరిగొచ్చినప్పుడు ఆ వెండి వస్తువు గురించి అనవసరంగా అందర్లో చాటింపు వేయొద్దని ఓ ఉచిత సలహా పారేశాడు వాలెంటిన్.

మొత్తానికి ఎవర్తో మాట్లాడుతున్నా, ఏం చేస్తున్నా ఫ్లాంబ్యూ కోసం మాత్రం ప్రతి ఒక్కరి మీదా ఓ కన్నేసే వుంచుతున్నాడతను. బీదా బిక్కీ, ఆడామగా ఎవరైనా సరే, కనీసం ఆరడుగుల ఎత్తుండే మనిషి కోసం అతని కళ్ళు చురుగ్గా అన్వేషిస్తూనే వున్నాయి. ఫ్లాంబ్యూ ఆరడుగుల నాలుగంగుళాల ఎత్తుంటాడు.

వాలెంటిన్ లివర్‌పూల్లో దిగేసి స్కాట్లండ్ యార్డు వెళ్ళాడు. మొదట లండన్లో తన పొజిషను క్లియర్ చేసుకోవాలి. అవసరమైతే అక్కడి అధికారుల్ని తనకు సాయంగా తెచ్చుకోగలగాలి.



స్కాట్లండ్‌యార్డు చేరుకునే ముందు ఫ్లాంబ్యూ తనకెక్కడా తారసపడలేదని గట్టిగా నిర్ధారించుకున్నాడతను. అక్కడ పనిపూర్తి చేసుకున్నాక మరో సిగరెట్టు వెలిగించి లండన్ వీధుల్ని పరిచయం చేసుకోవడానికి కాలినడకన బయల్దేరాడు.

విక్టోరియా ప్రాంతం దాటి వెళ్తుండగా వున్నట్టుండి ఆగిపోయాడు.

లండన్లోని అన్ని వీధుల్లాగే స్తబ్దుగా వున్న ప్రాంతమది. చూడ్డానికి డాబుసరిగ్గా వున్న ఎత్తైన ఇళ్ళు లోనెవరైనా కాపురం వున్నారా లేదా అనిపించేలా నిశ్శబ్దంగా నిలబడ్డాయి. వీధి మధ్యలో నలుచదరంగా వున్న పార్కు మరీ నిర్మానుష్యంగా వుంది. నలువైపులా బారులుతీరిన భవనాల్లో ఓ వైపు వరుస మిగతావాటికంటే ఎత్తుగా వుండి చూడ్డానికి డయాస్‌లా వుంది.

ఆ వరసలోనే వున్న ఓ రెస్టారెంటు ఆ వీధిలోని మిగతా భవనాలకంటే ప్రత్యేకంగా వుంది. అసలా రెస్టారెంటు ఆ ప్రాంతానికి చెందినట్టుగా లేదు. వేరే ఎక్కడ్నుంచో వూడిపడ్డట్టుగా వుంది. చాలా ఆకర్షణీయంగా వున్న రెస్టారెంటు. కుండీల్లో మరుగుజ్జు మొక్కలు ముచ్చటగా వున్నాయి. తెలుపు, పసుపురంగుల్లో కిటికీల అద్దాలు తళతళలాడుతున్నాయి. ముందే ఎత్తుగా వున్న ఆ వరసలో ప్రత్యేకించి ఆ కట్టడం మరీ ఎత్తుగా వుంది. వీధిలోకి వున్న మెట్లు దాదాపు ఓ అంతస్తు ఎత్తులో ముందు గుమ్మంలోకి దారితీస్తున్నాయి. వాలెంటిన్ సిగరెట్టు తాగుతూ చాలాసేపు ఆ కిటికీ అద్దాలవైపే చూస్తూ నిలబడ్డాడు.

అద్భుతాలనేవి జరగడమే అద్భుతాల్లో కెల్లా అద్భుతం. ఆకాశంలో మేఘాలు భూలోకం వైపు మిర్రి చూస్తున్నట్టు మనిషికన్ను రూపంలో ఏర్పడ్డం ఓ అద్భుతం. ఆ అద్భుతాన్ని అందరూ చూడలేరు. పదిమందిలో ఒక్కడు మాత్రమే అది గమనించగలుగుతాడు. అలాగే ఎక్కడో దూరంగా ఓ చెట్టు సరిగ్గా క్వశ్చన్ మార్కు రూపంలో పెరుగుతుంది. అదో అద్భుతం. దాన్ని కూడా అందరూ గమనించలేరు. ఆ దారి వెంట రైల్లో ప్రయాణిస్తూ ఏవో ఆలోచనల్లో మునిగిపోయినవాడల్లా ఒకడు అనుకోకుండా కిటికీలోంచి ఆవైపు చూస్తాడు. అతనికి మాత్రమే ఆ క్వశ్చన్‌మార్కు చెట్టు కనిపిస్తుంది.

చెప్పొచ్చేదేమంటే, కాకతాళీయంగా కొన్ని అద్భుతాలు అలా జరిగిపోతుంటాయి. వెయ్యి మందిలో ఒకడు మాత్రమే అలాంటి అద్భుతాన్ని గమనించగలుగుతాడు. ఎవరూ చూడలేనిది చూడగలగడమే తెలివని షా చెప్పిన మాట వింటానికెంత విపరీతంగా తోచినప్పటికీ అది అక్షరాలా నిజం.

అరిస్టైడ్ వాలెంటిన్ నిజంగా ఫ్రెంచివాడనిపించుకోదగ్గ మనిషి. ఫ్రెంచివాడి తెలివే తెలివి.

డిటెక్టివ్ రచయితలు తరచుగా తమ డిటెక్టివ్‌ని ఆలోచించేయంత్రంగా అభివర్ణిస్తూ వుంటారు. ఈ ఆధునిక భౌతికవాదయుగంలో పుట్టిన బుద్ధిలేని మాటది. యంత్రానికి ఆలోచించే శక్తి లేదు కాబట్టే దాన్ని మనం యంత్రం అని పిలుస్తున్నాం. వాలెంటిన్ ఆలోచించే యంత్రంకాదు—ఆలోచించే మనిషి. అందులోనూ సగటు ఫ్రెంచి పౌరుడిలా సాదాసీదామనిషి. అతని అద్భుతమైన విజయాలన్నీ సహేతుకమైన ఆలోచనా విధానంవల్ల సిద్ధించినవే. సగటు ఫ్రెంచిపౌరుడు వాస్తవికవాది. ఫ్రెంచివాళ్ళు శుష్కవాదాలతో ప్రపంచాన్ని ఉత్తేజితం చేయలేదు, వాస్తవిక

---

డిటెక్టివ్ కథకు సాహిత్య మర్యాద కల్పించిన

## జి.కె. చెస్టర్టన్ (1874–1936)

శవసాహిత్యం, అణాకానీ పుస్తకాలు—ఇత్యాది నామకరణాలతో అప్రతిష్ఠపాలైన డిటెక్టివ్ కథకు ఇంగ్లీషులో సాహిత్యమర్యాద కల్పించిన రచయితలు ఇద్దరే ఇద్దరున్నారు. ప్రఖ్యాత కవి సెసిల్ డేలూయిస్— 'నికొలాస్ బ్లేక్' అనే కలం పేరుతో డిటెక్టివ్ పుస్తకాలు రాశాడు. రెండో వ్యక్తి జి.కె. చెస్టర్టన్.

చెస్టర్టన్ బెర్నార్డ్ షా సమకాలికుడు. ఆరోజుల్లో బెర్నార్డ్ షా కున్నంత పేరూ సంపాయించుకున్నాడు. ఆయన స్పృశించని సాహిత్య విభాగం అంటూ లేదు. చిన్న కథలు, నవలలు, పద్యాలు, సాహిత్య విమర్శలు, వ్యాసాలు, చరిత్రలు, జీవిత చరిత్రలు, నాటకాలు అన్నింట్లోనూ అసమాన ప్రతిభ చూపించాడు. అంతేకాదు, ఆయన జర్నలిస్టు కూడా. అయితే, ఈరోజున చాలామంది ఆయన్ని ఫాదర్ బ్రౌన్ సృష్టికర్తగానే గుర్తుంచుకుంటున్నారు.

ధనవంతుల కుటుంబంలో పుట్టిన చెస్టర్టన్ చాలా చిన్నతనం నుంచే కలం చేపట్టాడు. మేజరు కాకముందే జర్నలిస్టయ్యాడు. తన కాలం



లోని మహారచయితలందరితో స్నేహం కలిగిందాయనకు.

రాజకీయంగా తనకంటూ ఆయనకు కొన్ని సిద్ధాంతాలుండేవి. ఆ సిద్ధాంతాల ప్రతిపాదన కోసం జీకేస్ వీక్లీ అనే పత్రిక పెట్టాడు. అయితే ఆ పత్రిక సరిగ్గా నడవక ఆర్థికపరమైన ఇబ్బందుల్లో పడ్డాడు. ఆ నష్టాలు పూడ్చుకోవడానికే డిటెక్టివ్ కథలు రాయడం మొదలెట్టాడు.

'నగరజీవితంలో అంతర్లీనంగా దాగివుండే కవిత్వానికి ప్రతిరూపమే డిటెక్టివ్ సాహిత్యం,' అంటాడాయన.

చెస్టర్టన్ సృష్టించిన డిటెక్టివ్ పేరు ఫాదర్ బ్రౌన్. పొట్టిగా, చూడ్డానికి మరీ అమాయకుడిలా వుంటాడు. ఎప్పుడూ ఓ పెద్ద గొడుగూ, కొన్ని బ్రౌన్ పేపరు పార్శెళ్ళూ వెంటబెట్టుకు తిరుగుతుంటాడు. చెస్టర్టన్ తన మిత్రుడైన ఫాదర్ జాన్ ఓ'కానర్ని దృష్టిలో వుంచుకుని ఫాదర్ బ్రౌన్ పాత్రను సృష్టించాడు. అచిరకాలంలోనే ఆ పాత్ర ప్రపంచ ప్రఖ్యాతి సంతరించుకుంది.

కొందరు మాత్రం ఫాదర్ బ్రౌన్‌ని ఘాటుగా విమర్శిస్తారు. ఓ టెక్కెట్టు ముక్క ముందు వెనకలు ఎలా వుంటాయో తెలుసుకోలేని దద్దమ్మ మరో షెర్లాక్ హోమ్స్ ఎలా కాగలడని వాళ్ళ ప్రశ్న.

అయినా ఫాదర్ బ్రౌన్ మరో షెర్లాక్ హోమ్స్ కాగలిగాడు.

అదే అతన్లోని గమ్మత్తు.

మయూరి వీక్లీ
31 జూలై 92

వాదంతో ఉత్తేజితం చేశారు. వాస్తవికవాదాన్ని ఫ్రెంచి విప్లవందాకా తీసుకెళ్ళారు.

వాలెంటిన్ హేతువుని అర్థం చేసుకున్న మనిషి మాత్రమే కాదు, హేతువుకున్న పరిమితుల్ని కూడా అర్థం చేసుకున్న మనిషి. మోటార్ల గురించి తెలియనివాడే పెట్రోలు లేకుండా మోటారు నడపడం గురించి మాట్లాడతాడు. హేతువుగురించి తెలియనివాడే బలమైన ప్రాథమిక సూత్రాలు లేని హేతువు గురించి మాట్లాడతాడు. ఇక్కడ వాలెంటిన్ ఎదుర్కొంటున్న సమస్య ఏమిటంటే ఈ కేసులో పరిశోధన సాగించడానికి ఎలాంటి ప్రాథమిక సూత్రం తన దగ్గర లేకపోవడమే.

హారిజ్ రేవులో దిగినప్పట్నుంచీ ఫ్లాంబ్యూ తనకు దొరక్కుండానే వున్నాడు. అతను లండన్లోనే వుంటే వింబుల్డన్ కామన్ ప్రాంతంలో తన్నాడే పోరంబోకు దగ్గర్నుంచీ మెట్రోపాలిస్ హోటల్లో పనిచేసే వంటమనిషిదాకా ఫ్లాంబ్యూ ఎవరైనా కావచ్చు. ఏమైనా తనెదుర్కొంటున్న విపరీత పరిస్థితుల్లో కూడా పరిశోధన కొనసాగించడానికి తన పద్ధతులు తనకున్నాయి.

ఎవరూ చూడలేనిది చూడగల తెలివితేటలకు తనలో కొదవేం లేదు. సహేతుకమైన పద్ధతిలో రాజమార్గాన వెళ్ళడం కుదరకపోతే నిర్హేతుకమైన పద్ధతిలో అడ్డదారినైనా వెళ్ళగలడు. అలాంటి సమయంలో బ్యాంకులూ, పోలీస్ స్టేషన్లూ, సంకేతస్థలాలవంటి సవ్యమైన చోట్ల వెతికేపని పెట్టుకోకుండా అపసవ్యమైన చోట్ల వెతకడం మొదలు పెడతాడు. ఖాళీగా పడున్న ఇళ్ళ తలుపులు కొడతాడు. చెత్తకుండీలు తిరగేస్తాడు. కసువు దిబ్బలు ఫడేసిన సందుల్లోకి దూర్తాడు. వంకరదారులు పట్టుకు తిరుగుతాడు.

తలతిక్కగా అనిపించే అలాంటి పద్ధతుల్ని అతను సహేతుకంగానే సమర్థించుకుంటాడు. నేరస్తుడ్ని పట్టించే క్లూ అంటూ వుంటే అది నిజంగా తలతిక్క పద్ధతే అవడంలో సందేహం అక్కర్లేదు. అయితే క్లూ అనేది లేనప్పుడు అంతకంటే మంచి పద్ధతి మరొకటి లేదు.

ఎక్కడో ఏదో చిన్న విశేషం తన దృష్టిని ఆకర్షించవచ్చు. అదే విశేషం తను వెతుకుతున్న మనిషి దృష్టిని కూడా ఆకర్షించి వుండవచ్చు. ఎక్కడో ఒక చోటు నుంచి పరిశోధన ప్రారంభించకతప్పదు. అదేదో తను వెతుకుతున్న మనిషిని ఆకట్టుకొని నిలబెట్టేసేలాంటి చోట్ల ప్రారంభించడమే మంచిది.

ఆ రెస్టారెంటులో వున్న ఏదో విశేషం— దాని రూపమో, ఎత్తుగావున్న ఆ మెట్లో— ఏదో వాలెంటిన్ని ఆకర్షించింది. ఎందుకో ఇక్కడ ప్రయత్నిస్తే ఎలావుంటుందనిపించింది. దాంతో అతను చకచకా మెట్లెక్కేసి ఆ రెస్టారెంట్లోకి వెళ్ళాడు. కిటికీ పక్కగా వున్న టేబుల్ ముందు కూర్చొని ముందు కప్పు కాఫీ ఆర్డరిచ్చాడు.

చుట్టు పక్కల జనం ఉదయంపూట బ్రేక్‌ఫాస్టు ఆరగిస్తున్నారు. ఘుమఘుమలాడుతున్న టిఫిను వాసనలకు అతనికి ఆకలి వేసినట్టనిపించింది. అంతలోకే ఆ ఉదయం తనింకా టిఫినే తినలేదన్న సంగతి అకస్మాత్తుగా గుర్తుకొచ్చింది. దాంతో కాఫీతోపాటు టిఫిను కూడా ఆర్డరిచ్చి నిరధ్యానంగా కూర్చున్నాడు.

ఫ్లాంబ్యూ ఒకసారి గోళ్ళ కత్తెర సాయంతో తప్పించుకుపోతే మరోసారి ఓ ఇంటికి నిప్పంటించి తప్పించుకున్నాడు. ఒకసారి స్టాంపులేని ఉత్తరానికి ఫైనుకట్టే నెపంతో తప్పించుకుంటే ఇంకోసారి ప్రపంచాన్ని నాశనం చేసే తోకచుక్కని టెలిస్కోపులో చూపిస్తానని జనాన్ని పోగేసి ఆ గుంపులో కనిపించకుండా తప్పించుకుపోయాడు.


అతను తెలివైనవాడని ఒప్పుకోక తప్పదు. తను కూడా ఫ్లాంబ్యూకేం తీసిపోడు. అయితే ఒక విషయంలో మాత్రం తను అతనికంటే వెనకబడి వున్నాడు. అరవైనాలుగు కళల్లో చౌర్యం కూడా ఒక సృజనాత్మకమైన కళ. ఆ విధంగా నేరస్తుడనేవాడు కళాకారుడైతే నేరస్తుడ్ని పట్టుకునే అపరాధ పరిశోధకుడు కేవలం విమర్శకుడు మాత్రమే. వాలెంటిన్ చేదుగా నవ్వుకున్నాడు.

బ్రేక్‌ఫాస్టు పూర్తిచేశాక అతనింకా అదే నిరధ్యానంలో కాఫీలో చక్కెర కలుపుకొని కప్పు

## ఖుష్బూ విషాదం



నా బోయ్ ఫ్రెండ్, సినిమాలు కావాలో తను కావాలో తేల్చుకోమన్నాడు. నేను అతన్నే కోరుకుని సినిమాలు వదిలేశాను. ఆ తర్వాత ఏం జరిగింది? అతగాడు నన్నొదిలేసి తనదారి తాను చూసుకున్నాడు—అని వాపోయింది ఖుష్బూ.



ఈమధ్య అంబాప్రసాద్ చారిటబుల్ ట్రస్టు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న వరల్డ్ జైన్ కౌన్సిల్ అధ్యక్షుడు మోనత్. ఎస్. హస్తిమాల్ జైన్.

నోటికందించుకున్నాడు. వెంటనే వులిక్కిపడి కాఫీ కిందపెట్టేశాడు. అందులో తను కలిపింది చక్కెరకాదు, ఉప్పు.

దాంతో అతను తనిందాక చక్కెరగిన్నె అనుకున్నదాన్ని చేతిలోకి తీసుకుని పరీక్షగా చూశాడు. ఊరగాయజాడీ వున్నది వూరగాయకోసమే అన్నట్టుగా ఆ చక్కెర గిన్నె వున్నది చక్కెరకోసమే. అందులో ఏమాత్రం సందేహం అవసరం లేదు. చక్కెరగిన్నెలో ఉప్పున్నదంటే అర్థమేమిటి?

అలాంటి గిన్నెలు మరింకేమైనా వున్నాయేమో చూశాడు. ఉప్పు గిన్నెలు రెండు నిండుగా కనిపించాయి. రుచి చూశాడు. ఉప్పు గిన్నెలో వున్నది ఉప్పుకాదు, చక్కెర. చక్కెరగిన్నెలో వున్నది చక్కెరకాదు, ఉప్పు.

వాలెంటిన్‌కు అకస్మాత్తుగా ఆసక్తిపుట్టుకొచ్చింది. అలాంటి అవకతవకలు మరింకేమైనా కనిపిస్తాయేమోనని ఓసారి అటూ ఇటూ చూశాడు. తెల్లగా పరిశుభ్రంగా వున్న గోడమీద ఒకచోట నల్లగా ఏదో పారబోసిన పెద్ద మరకతప్ప మరింకేం కనిపించలేదు.

ఉప్పుకు బదులు చక్కెర, చక్కెరకు బదులు ఉప్పు వాడే మహత్తరమైన అభిరుచి ఎవరిదై వుంటుందో?

అతను వెంటనే వెయిటర్ని పిలిచాడు.

చింపిరి జుట్టుతో నిద్రమత్తుకళ్ళతో జోగుతున్నట్టుగా వున్న వెయిటరు అక్కడికొచ్చాడు.

వాలెంటిన్లో కొంత హాస్య ప్రవృత్తి కూడా వుంది. వెయిటరు వస్తూనే అతన్నోసారి చక్కెర రుచిచూసి ఎలావుందో చెప్పమన్నాడు. వెయిటరు బుర్రూపి నిద్రమత్తు కళ్ళతో జోగుతూనే చక్కెర అనబడే ఆ పదార్థాన్ని కొద్దిగా నోట్లో వేసుకున్నాడు. ఆ మరుక్షణం ఒక్కసారిగా అంతెత్తున ఎగిరిపడ్డాడు. నిద్రమత్తుకాస్తా వదిలిపోయింది.

"ఏమయ్యా, ఇలాంటి కుళ్ళుజోకు మీ హోటలు కొచ్చే కస్టమర్లందరి మీదా ప్రయోగిస్తుంటారా? ఉప్పుకు బదులు చక్కెర, చక్కెరకు బదులు ఉప్పు తినిపించడం సరదా అనుకుంటున్నావా?" అంటూ అతన్ని నిలదీశాడు వాలెంటిన్.

వెయిటరుకు మొదట అసలేం అర్థం కాలేదు. అర్థమైన వెంటనే తడబడిపోతూ అసలా కుళ్ళుజోకు హోటలువాళ్ళది ఏమాత్రం కాదని సవినయంగా విన్నవించుకున్నాడు. ఎక్కడో ఏదో విచిత్రమైన పొరపాటు జరిగివుండాలని మనవి చేసుకున్నాడు. తర్వాత చక్కెరగిన్నె పైకెత్తి అందులో వున్న పదార్థం వంక గుడ్లప్పగించి చూశాడు. ఆ తర్వాత ఉప్పుగిన్నె పైకెత్తి అందులో వున్న పదార్థంవంక కూడా గుడ్లప్పగించి చూశాడు.

అతని మొహంలో రంగులు చకచకా మారిపోయి అందులేని విస్మయం తొంగి చూసింది. వెంటనే అక్కడ్నించి పరిగెత్తుకుంటూ వెళ్ళి హోటలు ప్రొప్రయిటర్ని పట్టుకొచ్చాడు. ప్రొప్రయిటరు కూడా ఆ గిన్నెలు పరీక్షించి చూసి అంతకంటే విస్మయం పాలైపోయాడు.

అంతలోనే అకస్మాత్తుగా వెయిటరుకేదో గుర్తుకురావడంతో అమాంతం ఎగిరి గంతేశాడు.

"వాళ్ళే, ఆ ఇద్దరు ఫాదరీలే," అన్నాడు తత్తరపడిపోతూ.

"ఫాదరీలేమిట్రా?" ఆరాతీశాడు ప్రొప్రయిటరు.

"ఆ ఇద్దరు ఫాదరీలు సార్, గోడమీద సూపు నొలకబోసిన ఫాదరీలు," చెప్పాడు వెయిటరు.

"సూపు గోడమీద పారబోశారా?" అన్నాడు వాలెంటిన్. వెయిటరు మాట్లాడుతున్నది తప్పుకుండా ఏదో అరవభాషేనని అనుమానం వచ్చిందతనికి.

"అవున్సార్, అవును. అదిగో ఆ గోడమీద పారబోశారు," గోడమీద మరక చూపించాడు వెయిటరు.

వాలెంటిన్ ప్రశ్నార్థకంగా ప్రొప్రయిటరు కేసి చూశాడు. వెంటనే ప్రొప్రయిటరు అసలు జరిగిందేమిటో తంచనుగా వివరించేశాడు—

"అవునండీ, వాడు చెప్పేది నిజమే. ఇద్దరు ఫాదరీలు ఉదయం మేము షట్టరు తెరవగానే లోపలికొచ్చి ఇక్కడ సూపు తీసుకున్నారు. ఇద్దరూ మర్యాదస్తులుగానే కనిపిస్తున్నారు. వాళ్ళలో ఒకాయన బిల్లు పేచేసి ముందుగా బయటికి వెళ్ళిపోయాడు. ఆ రెండో ఫాదరీ మరీ మందకొడిగా వున్నాడు. మొదటి ఫాదరీ బయటికి వెళ్ళిన కాసేపటిగ్గానీ ఆయన తన వస్తువులన్నీ తీసుకుని ఇక్కడ్నించి కదల్లేదు. అయితే వెళ్ళేముందు గిన్నె తీసుకుని సగం సూపు కావాలని ఆ గోడమీద పారబోశాడు. ఆ సమయంలో నేనూ మా వెయిటరూ వెనగ్గదిలో వున్నాం. నేను వెళ్ళి చూసేసరికే జరగాల్సిందంతా జరిగిపోయింది. దానివల్ల మాకు పెద్ద నష్టమేం జరగలేదనుకోండి, అయినా వాళ్ళని పట్టుకుందామని వీధిలోకి పరిగెత్తాను. అప్పటికే వాళ్ళిద్దరూ చాలాదూరం వెళ్ళిపోయి కారిస్టైరు వీధిలోకి తిరుగుతున్నారు. దాంతో వాళ్ళింక దొరకరు లెమ్మనుకొని తిరిగొచ్చేశాను."

అతను చెప్పింది వింటూనే వాలెంటిన్ హ్యాటు సర్దుకుంటూ తన చేతికర్రందుకుని దిగ్గున లేచి నిలబడ్డాడు..

అప్పటికకే అతనో నిర్ణయానికొచ్చేశాడు.

అంతుపట్టని అంధకారంలో చిన్న సూచన దొరికినా దాన్ని పట్టుకుని ముందుకుసాగాలి. ఈ సూచనేదో వింతగానే వుంది. తన బిల్లు కట్టేసి గాజు తలుపులు నెరుమకుంటూ ఒక్క ఉదుటన అక్కడ్నించి బయటపడ్డాడు.

కాసేపట్లోనే అతను వేగంగా అవతలి వీధిలోకి మలుపు తిరుగుతున్నాడు.


(మిగతా వచ్చేవారం)

## శ్రీదేవి—మాధురి



శ్రీదేవికి అడుగడునా ఒళ్ళు దగ్గర పెట్టుకుని గమనిస్తోంది మాధురీ దీక్షిత్. శ్రీదేవితో పాటు సమాన స్థాయిలో వుండేందుకు మాధురి అన్ని ప్రయత్నాలు చేస్తోంది.

ఈ మధ్య శ్రీదేవి ఒక ప్రముఖ ఆంగ్ల పత్రిక కవర్ పేజీపై స్థానం సంపాదించుకుంది. మరి మాధురి కూడా ఏదైనా ఆంగ్ల పత్రిక కవర్ పేజీకి ఎక్కుతుందేమో చూడాలి!




# నీలం శిలువ

జి.కె.చెస్టర్టన్

దాదా హయాత్

(గత సంచిక తరువాయి)

అదృష్టవశాత్తు అంత తొందరలోనూ అతని చూపు మరుగ్గానే పనిచేస్తోంది. ఎదురుగా వున్న షాపులో ఏదో ఫ్లాష్‌లా అతన్ని దాటిపోయింది. అతను చటుక్కున ఆగిపోయి మళ్ళీ వెనక్కొచ్చి మరీ అదేమిటో చూశాడు.

పళ్ళూ కూరగాయలు దొరికే అంగడది. ఆ షాపు యజమాని అక్కడ దొరికే వస్తువుల మీద పేర్లతో సహా రేట్లు స్పష్టంగా అట్టల మీద రాసి వేటికవి విడివిడిగా తగిలించాడు. అక్కడున్న వాటన్నింటిలోకీ పెద్ద గంపలు రెండున్నాయి. ఓ గంపలో నారింజ పళ్ళు. రెండో గంపలో వేరుశనక్కాయలు నిండుగా వున్నాయి. తమాషా ఏమిటంటే వేరుశనక్కాయలకు తగిలించిన అట్టమీద, 'తాజా నారింజ పళ్ళు పెన్నీకి రెండు' అనీ, నారింజ పళ్ళ గంపకేమో— 'మేలు రకం వేరుశనక్కాయలు నాలుగు ప్రైములకో పౌను' అనీ అట్టలు తగిలించి వున్నాయి.

వాలెంటిన్ ఆ అట్టలకేసి ఆసక్తిగా చూశాడు. అలాంటి కుందమార్పిడి ఇందాకే చూసి వుండడం వల్ల అతన్ని ఆ అట్టలు నిలబెట్టేశాయి. ఆ అట్టలు మారిపోవడం గురించి షాపు యజమానికి చెప్పాడతను.

షాపు యజమాని మొహం ముందుగానే టమేటా పండులా ఎర్రగా వుంది. వాలెంటిన్ ఆ అట్టల గురించి చెబుతూనే అతను ఒక్కసారిగా రుసరుసలాడిపోతూ ఎందుకో ఓసారి వీధిలోకి ఎగాదిగా చూసి గమ్మున ఆ అట్టలు సరిచేసి పెట్టాడు. వాలెంటిన్ తన చేతికర్ర మీదికి వాలుతూ ఆ షాపుని పరిశీలనగా చూశాడు.

"చూడండీ, మిమ్మల్నో మాట అడగొచ్చునా? ఈ అట్టలెందుకు మారిపోయాయో చెప్పగలరా?" అంటూ ఆరాతీశాడు.

వాలెంటిన్ ఆ మాటడుగుతూనే షాపు యజమాని కనుగుడ్లు కోపంతో కోడిగుడ్లలా ముందుకు పొడుచుకొచ్చాయి. ఆ కోపంలో అతను అమాంతంగా తన మీదికి దూకేసి లెఫ్టు రైటు ఇచ్చుకుంటాడా అనే అనిపించింది. అయితే పాపం చివరికెలాగో అతను తమాయించుకోగలిగాడు.

"అదంతా నీకెందుకు?" ఖస్సుమంటూ లేచాడతను. "అయినా ఇదిగో చెబుతున్నా, ఆ ఫాదరీలే గనక నీకు తెలిసుంటే వెళ్ళి వాళ్ళకి చెప్పు— ఈ సారి వాళ్ళు నా ఆపిల్ పళ్ళ జోలికొస్తే తలదీసి మొలేస్తాను. వాళ్ళు ఫాదరీలైందీ ఇంకేమైందీ అనక చూసుకుంటాను" అన్నాడు విసురుగా.

వాలెంటిన్ అతనికేసి బోలెడు జాలిపడిపోతున్న వాడిలా చూశాడు.

"వాళ్ళు మీ ఆపిల్ పళ్ళనేం చేశారు?" అన్నాడు.

"వాళ్ళిద్దర్లో ఒకడు బుట్ట తన్నేసి ఆపిల్ పళ్ళు రోడ్డంతా పడేశాడు. పళ్ళు మళ్ళీ ఏరుకోనివ్వి రాబట్టి గానీ, లేకుంటేనా! వెధవని పట్టి అక్కడికక్కడే దుమ్ము లేపేసేవాణ్ణి."

"అలాగా పాపం! ఇంతకీ ఆ ఇద్దరు ఫాదరీలు ఎటెళ్ళినట్టో?"

"అల్లదిగో, ఎడం చేతివైపు ఆ రెండో వీధిలోకి."

"థాంక్స్" అంటూనే వాలెంటిన్ ఏదో మంత్రం వేసినట్టు అమాంతం అక్కడ అదృశ్యమైపోయి ఆ షాపు యజమాని చెప్పిన వీధిలో ప్రత్యక్షమైపోయాడు. అక్కడో పోలీసు కానిస్టేబుల్ నిలబడివున్నాడు.

"కానిస్టేబుల్, ఇద్దరు ఫాదరీలు ఇటుగుండా వచ్చారేమో అర్జెంటుగా చెప్పండి" అన్నాడు వాలెంటిన్.

అతను ఫాదరీల వూసెత్తుతూనే ఆ కానిస్టేబుల్ ఏదో జోకు విన్నట్టు బిగ్గరగా నవ్వేశాడు.

"చూడకేం, చూశాను. వాళ్ళిద్దర్లో ఓ ఫాదరీ తాగుబోతులా వున్నాడు. ఆ రోడ్డు మధ్య నిలబడి ఎటెళ్ళాలో తెలీక..." అంటూ అతనింకా ఏదో అనబోతున్నాడు.

"వాళ్ళిద్దరూ ఎటెళ్ళారు?" చప్పున అడిగాడు వాలెంటిన్.

"అక్కడ పచ్చ బస్సెక్కి వెళ్ళారు— హాంప్‌స్టెడ్ వెళ్ళే బస్సు" చెప్పాడు కానిస్టేబుల్.

వాలెంటిన్ అతనికి తన ఆఫీషియల్ కార్డు చూపించి, "మీ వాళ్ళిద్దర్ని నాతో రమ్మనండి" అంటూ సమాధానం కోసం ఎదురు చూడకుండా చకచకా రోడ్డు దాటేశాడు. ఆ కార్డు చూస్తూనే కానిస్టేబుల్ మొహం మారి

పోయింది. తక్షణం అతనివెంట మహా వినయంగా తనూ పరుగెత్తాడు. మరో నిమిషంలో ఎదురుగా వున్న పేవ్‌మెంటుమీద ఓ ఇన్స్‌పెక్టరూ, మఫ్టీలో వున్న మరో పోలీసాఫీసరూ వాలెంటన్‌ని కలుసుకున్నారు.

"నమస్తే సార్, ఏమిటి విశేషం?" వినయవృతో అంటున్నాడు ఇన్స్‌పెక్టర్.

వాలెంటీన్ తటాల్న వేతిక్రతో ఓ వైపు చూపించాడు.

"ఆ బస్సులో చెబుతాను" అంటూనే జన సమ్మర్దంలో ఆ వైపు దౌడు తీశాడు. బస్సులో ఆయాసంతో రొప్పుతూ ముగ్గురూ ఓ సీట్లో సర్దుకున్నారు.

"టాక్సీలో అయితే ఇంతకంటే నాలుగింతలు స్పీడుగా వెళ్ళొచ్చు" అన్నాడు ఇన్స్‌పెక్టర్.

"నిజమే. కానీ, మనం ఎక్కడికెళ్తున్నామో తెలిసినప్పుడు గదా టాక్సీలో వెళ్ళగలం" అన్నాడు వాలెంటీన్.

ఇన్స్‌పెక్టర్ అతన్ని కళ్ళప్పగించి చూశాడు. "మీరైతే ఇప్పుడెక్కడికి?" అన్నాడు.

వాలెంటీన్ కొద్దిసేపు సిగరెట్టు తాగుతూ మౌనంగా వుండిపోయాడు. తర్వాత నోట్లోంచి సిగరెట్టు తీసి అతని వైపు తిరిగాడు. "అపరాధ పరిశోధనలో ఒక మనిషి ఏం చేస్తున్నాడో తెలిస్తే మనం అతనికంటే ముందుండాలి. అతనేం చేస్తున్నాడో తెలీకపోతే మాత్రం వెనకే వుండి వెంబడించాలి. అతను కదిలినప్పుడు మనం కదలాలి. అతనాగినప్పుడు మనం ఆగాలి. అతనెంత నెమ్మదిగా ప్రయాణిస్తాడో మనమూ అంత నెమ్మదిగా ప్రయాణించాలి. అప్పుడు అతను చూడగలిగిందే మనం చూడగలం. అతను చేయగలిగిందే మనం చేయగలం. ప్రస్తుతం ఏదైనా వింత కనిపిస్తుందేమో చూడ్డానికి రెండుకళ్ళూ తెరిచిపెట్టుకోవడం తప్పిస్తే మనం చేయగలిగిందేం లేదు" అన్నాడు.


"వింతంటే?" అడిగాడు ఇన్స్‌పెక్టర్.

"వింతంటే వింతే" అంటూ వాలెంటీన్ మౌనసముద్రంలో మునిగిపోయాడు.

పచ్చ బస్సు నత్తనడకతో నగరంలో ఉత్తర దిశగా నెమ్మదిగా కదుల్తోంది. అందులో కూచుంటే నిమిషాలు గంటల్లాఅనిపిస్తున్నాయి. అంతకంటే ఎక్కువగా అతను తమతో ఏం మాట్లాడకపోయేసరికి ఆ పోలీసు అధికారులకు అతను క్రూక్ లూజేమోనని అనుమానమే వచ్చిందో, లేక బస్సులోనే మధ్యాన్నం గడిచిపోవడంతో ఆకలే వేసిందో తెలీదుగానీ, మొత్తానికి వాళ్ళు కూడా అతన్తోపాటు మౌనంగా వుండిపోయారు.

ఆ బస్సు ఓ వీధి తర్వాత మరో వీధిలోకి నిదానంగా వెళ్తోంది. అంతసేపు ప్రయాణించి భూమి చివరికొచ్చేశామా అనిపించేంత సదీర్ఘమైన ప్రయాణమది. తీరాచూస్తే వచ్చింది భూమి చివరిక్కాదు, ఆ వీధి చివరి పార్కుకే అని తెలిసి ప్రాణం వుసూరుమనిపించే ప్రయాణం. లండను మహానగరం అంతటితో ముగిసిపోయిందా అనిపిస్తుండగానే మళ్ళీ ఎత్తైన భవనాలూ, పెద్దపెద్ద హోటళ్ళు కనిపించడం ప్రారంభమైపోతోంది. అది ఒక నగరం కాదు, కనీసం అరడజను నగరాలు ఒకదానికొకటి ఆనుకొని దర్శనమిస్తున్నాయా అనిపించే ప్రయాణం.

లండను వాతావరణం చిత్రమైంది. అది మధ్యాహ్నం పూటే అయినా వీధుల్లో పొగమంచు వ్యాపించి అప్పుడే సాయంకాలమై పోయిందా అనే భ్రాంతి కలుగుతోంది. ఎంతసేపు గడిచినా వాలెంటీన్ మాత్రం నోరుతెరిచి ఒక్కమాట కూడా మాట్లాడలేదు. కిటికీ దగ్గర కూచుని వీధుల్ని పరిశీలనగా చూస్తున్నాడు. బస్సు కేమ్డెన్ టవును దాటే సమయానికి అతని వెంట వచ్చిన పోలీసాఫీసర్లు కునికిపాట్లు పడనారంభించారు. అంతలోనే అకస్మాత్తుగా వాలెంటీన్ తామిద్దర్నీ తట్టిలేపేసరికి అదిరిపడి కళ్ళు తెరిచారు. అప్పటికే వాలెంటీన్ వాళ్ళిద్దరి భుజాల మీద చేతులు వేసి దిగ్గున లేచి నిలబడిపోతూ డ్రైవర్ని బస్సాపమంటూ గట్టిగా



అరిచాడు.

అతనంత హఠాత్తుగా తమనెందుకు బస్సు దింపేస్తున్నాడో అర్థం కాక వాళ్ళు ఫుట్‌బోర్డు మీదుగా రోడ్డు మీది కొచ్చి పడ్డాడు. ఏం జరుగుతోందో తెలుసుకోవడానికి వాళ్ళు దిక్కులు చూస్తుండగా వాలెంటీన్ ఆ రోడ్డుకు ఎడం చేతివైపు ఓ కిటికీకేసి వేలుపెట్టి చూపిస్తూ దర్శనమిచ్చాడు. అదో రెస్టారెంటుకు చెందిన పెద్ద కిటికీ. ఆ కిటికీ అద్దం నడిమధ్యన నక్షత్రాకారంలో పగిలింది.

"ఆహా! క్లూ దొరికేసింది చూశారా? పగిలిన కిటికీ" చేతి కర్ర తిప్పుతూ మహోదానందంగా అరిచాడు వాలెంటీన్.

"కిటికీ ఏమిటి, క్లూ ఏమిటి? మనం వెతుకుతున్నవాళ్ళకు దీంతో సంబంధం వుందని నిదర్శనం ఏమిటి?" అన్నాడు ఇన్స్‌పెక్టర్.

ఆ మాటతో వాలెంటీన్ అగ్గిమీద గుగ్గిలమైపోతూ తన చేతికర్రని దాదాపు విరగ్గొట్టేసినంత పనిచేశాడు.

"నిదర్శనమా! గుడ్ గాడ్, నిదర్శనం కావాలట నిదర్శనం!? ఆల్‌రైట్, వాళ్ళకు దీంతో సంబంధం లేకపోవచ్చు. అయితే మనం చేయగలిగింది మాత్రం ఏమిటి? ఎంత అసంబద్ధమైనా దొరికిన ఆధారాన్ని పట్టుకొని ముందుకెళ్ళాలి. లేదంటే ఇంటికెళ్ళి నిండా ముసుగుతన్ని పడుకోవాలి. తెలిసిందా?" అంటూ అరిచి కాళ్ళు నేలకేసి టపటపా కొట్టుకొంటూ ఆ రెస్టారెంటులోకి వెళ్ళాడు. వెంటనే మిగతా ఇద్దరూ ఒకరి మొహం ఒకరు చూసుకుంటూ బుద్ధిగా అతన్ననుసరించారు.

మరికాసేపట్లోనే వాళ్ళు ముగ్గురూ ఓ చిన్న టేబుల్ ముందులేటుగా మధ్యాహ్నం భోజనానికి తయారై నక్షత్రాకారంలో పగిలిన ఆ అద్దాన్ని లోపలివైపు నుంచి చూస్తూ కూర్చున్నారు. ఏ వైపు నుంచి చూసినా దాని వల్ల వాళ్ళకు తెలిసింది మాత్రం ఏం లేదు.

భోంచేశాక బిల్లు పే చేస్తూ నెమ్మదిగా వెయిటర్ని కదిలిస్తూ అన్నాడు వాలెంటీన్ "మీ కిటికీ అద్దం పగిలినట్టుందే?"

"అవును" అతనిచ్చిన చిల్లర ఎంచుకుంటూ పరధ్యానంగా అన్నాడు వెయిటరు. వాలెంటీన్ చప్పుడు కాకుండా పెద్ద టిప్పు ఆ చిల్లరతోపాటు కలిపేశాడు. దాంతో వెయిటరు నిటారుగా నిలబడిపోయాడు.

"అవున్సార్, అవును. చాలా చిత్రంగా జరిగింది" అన్నాడు.

"అలాగా! అదేమిటో చెప్పు" నిర్లక్ష్యంగా అంటూనే ఆసక్తి కనబర్చాడు వాలెంటీన్.

వెయిటరు హుషారుగా చెప్పసాగాడు



## అందరికీ నచ్చే 'చిరు' స్వరం

ఆంధ్రప్రదేశ్‌లో ప్రేక్షకులకి నేనన్నా, నా కంఠ స్వరం అన్నా, డైలాగ్ చెప్పే విధానం అన్నా చాలా ఇష్టం. ఎవరైనా హిందీ నిర్మాతలు నా వాయిస్‌ని డబ్బింగ్ చేసుకుందామనుకున్నా ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం నా స్వరంతోనే ప్రింట్స్ రిలీజ్ అవుతాయి. ఇది మస్ట్ అండ్ షుడ్— అన్నాడు 'మెగాస్టార్' చిరంజీవి

"ఇద్దరు మనుషులొచ్చారండీ. ఈ మధ్య లండన్లో ఫాదరీల రద్దీ ఎక్కువైందిగా, వాళ్ళన్న మాట. ఇద్దరూ గమ్మున భోంచేశారు. ఒకాయన బిల్లిచ్చి బయటకి వెళ్ళిపోయాడు. రెండో ఆయన కూడా అప్పుడే వెళ్ళబోతున్నాడు. నేను డబ్బులకేసి చూసేసరికేముందీ, బిల్లుకి మూడింతలు ఎక్కువిచ్చి వెళ్ళారు వాళ్ళు. అప్పుడే గుమ్మందాటబోతున్న ఆ ఫాదరీని కేకేసి ఆ మాటే చెప్పాను. 'ఓ, అయితే ఎక్కువిచ్చామా?' అన్నాడాయన. అవునంటూ ఆయనకు బిల్లు చూపించబోయాను. దెబ్బకు దిమ్మెరపోయానంటే నమ్మండి" అన్నాడు.

"అంటే?" అడిగాడు వాలెంటీన్.

"దైవసాక్షిగా నేను బిల్లు మీద నాలుగంకె వేశాను. కానీ, అప్పుడు చూస్తే పధ్నాలుగు కనిపించింది."

"తర్వాతేమైంది?" అడిగాడు వాలెంటీన్ అతని కళ్ళు మెరిసిపోనారంభించాయి.

"ఆ ఫాదరీ మొదట బెల్లం కొట్టిన రాయిలా చూశాడు. తర్వాత, 'ఆ లెక్కలు తారుమారు చేసినందుకు ఏమనుకోకేం. మిగిలిన డబ్బు ఆ కిటికీకి సరిపోతుందిలే' అన్నాడు.

ఆయన చెబుతున్నదేమిటో నాకర్థం కాలేదు. 'ఏ కిటికీ?' అన్నాను. 'ఇప్పుడు నేను పగలగొట్టబోతున్న కిటికీ' అంటూనే, దాని దుంపతెగ, గొడుగుతో అమాంతం ఆ కిటికీ పగలగొట్టేశాడు."

వెయిటరు చెప్పిన కథకు ముగ్గురూ నోరు తెరిచేశారు.

"కొంపదీసి మనం ఏ పిచ్చాసుపత్రి నుంచి పారిపోయిన శాల్తీనో వెంబడించడం లేదు గదా!" సందేహం వెలిబుచ్చాడు ఇన్స్‌పెక్టర్.


వెయిటర్ అంతటితో తను చెబుతున్న కథ ఆపలేదు. ఇంకా ఉత్సాహంగా చెప్పుకుంటూ వెళ్ళాడు.

"ఒక్క క్షణం నాకు బుర్రపనిచేయలేదు. ఏంచేయాలో తోచలేదు. ఆ ఫాదరీ తిన్నగా వెళ్ళి తన ఫ్రెండుని రోడ్డు మలుపు దగ్గర కలుసుకున్నాడు. తర్వాత వాళ్ళిద్దరూ ఎద్దులవారి వీధిలోకి ఎంత స్పీడుగా వెళ్ళిపోయారంటే నేను పరిగెత్తినా వాళ్ళని పట్టుకోలేకపోయాను."

"ఎద్దులవారి వీధి" అంటూనే వాలెంటీన్ వేగంగా అక్కడ్నించి బయటికి పరిగెత్తాడు.

ఈసారి వాళ్ళు సొరంగాల వంటి ఇరుకుసందుల గుండా ముందుకు సాగాల్సి వచ్చింది. ఆ సందుల్లో వీధి దీపాలుగానీ, కనీసం ఇళ్ళ కిటికీలు గానీ ఎక్కువగా లేవు. ఎక్కడ చూసినా ఇళ్ళ పెరటిగోడలే దర్శనమిస్తున్నాయి. అలా సందులు పట్టుకు తిరగడంలోనే సాయంకాలమై చీకటిపడిపోయింది. చివరికి లండను వాసులైన ఆ పోలీసు అధికారులు కూడా తాము ఏ వైపు వెళ్తున్నారో వూహించలేకపోతున్నారు. అయితే ఇన్స్‌పెక్టర్ మాత్రం తామలాగే ముందుకు వెళ్తే హాంప్‌స్టెడ్ హీత్ ప్రాంతం చేరుకుంటామని గట్టి నమ్మకం వెలిబుచ్చాడు. అంతలోకే ఆ చీకట్లో ఎదురుగా ఓ కిటికీ గుండా కిరసనాయిలు బుడ్డీ వెలుతురు బయటికి ప్రసరించడం కనిపించింది. అదో చిన్న మిఠాయి అంగడి. ఆ దీపాన్ని చూస్తూనే వాలెంటీన్ ఆగిపోయాడు. ఒక్క క్షణం తటపటాయించి నేరుగా లోపలికి వెళ్ళాడు. లోన గోడలకి ముదురు రంగులు కొట్టి వికారంగా వుందా అంగడి. వాలెంటీన్ ఆ అంగట్లో పదమూడు చాక్లెట్ సిగార్లు కొన్నాడు. అతని మొహం గంభీరంగా వుంది. అసలు విషయానికి రావడానికి ఉద్యుక్తుడవుతున్నాడు. అయితే అతనికా అవసరం లేకపోయింది.

# నిర్ణయం నాదికాదు



'ఫూల్ ఔర్ కాంటే' చిత్రం హిట్ అవడంలో క్రెడిట్ అంతా నేనే దక్కించుకున్నానంది మధూ. దానికి కారణం నేనే అంటే సరిపోతుందా? ఎవరి కారణంగా హిట్ అయిందన్న విషయాన్ని నేనో, మధో లేక మరో కాదు కదా నిర్ణయించాల్సింది. ఎవరి క్రెడిట్ ఎంతో ప్రేక్షకులు నిర్ణయిస్తారు— అంటున్నాడు అజయ్ దేవ్‌గణ్.

ఆ అంగట్లో వున్న ఓ ప్రౌఢవయస్కురాలు వాలెంటిన్‌కేసి మొదట యాంత్రికంగా చూసింది. తర్వాత ఆమె చూపులు గుమ్మంలో నిలబడివున్న ఇన్స్‌పెక్టరు వైపు తిరిగాయి. అతన్ని చూస్తూనే ఆమె అప్పుడే నిద్రనుంచి లేచిందాన్లా ఒక్కసారిగా వులిక్కిపడింది.

"మీరా పార్సెల్ కోసం వచ్చారా? అదెప్పుడో మీకు పంపేశానే" అంది.

"పార్సెలా?" అన్నాడు వాలెంటిన్. ఈసారి గుడ్లప్పగించి చూడ్డం అతని వంతైంది.

"ఆ పెద్ద మనిషి వదిలి వెళ్ళిన పార్సెలండీ. ఫాదరీలా వున్న ఆ పెద్దమనిషి" అందామె.

"ఓ గాడ్!" వాలెంటిన్ ఈసారి తన ఆత్రుతను ఏమాత్రం ఆణచుకోలేకపోయాడు. "అసలేం జరిగిందో చెప్పు" అన్నాడు ముందుకు వంగిపోతూ.

ఆమె కొంచెం సందేహంగా చూసింది. "ఇప్పుడే అరగంట క్రితం ఇద్దరు ఫాదరీలొచ్చి పిప్పరమెంట్లు కొన్నారు. ఒకటి రెండు మాటలు తప్ప నాతో ఎక్కువేం మాట్లాడలేదు. పిప్పరమెంట్లు కొన్నాక హేంప్‌స్టెడ్ వైపు వెళ్ళిపోయారు. అయితే ఓ సెకండు గడిచిందో లేదో వాళ్లలో ఓ ఫాదరీ వెనక్కి పరిగెత్తుకుంటూ వచ్చి, 'నేనేమైనా పార్సెలు మర్చిపోయానా?' అన్నాడు. షాపంతా వెతికినా ఆ పార్సెలు కనిపించలేదు. 'మరేం ఫర్వాలేదు. ఆ పార్సెలు కనిపిస్తే ఈ అడ్రసుకు పోస్టులో పంపించ'మని అడ్రసుతో పాటు ఓ షిల్లింగు డబ్బు కూడా ఇచ్చి వెళ్ళిపోయాడు. నేనా పార్సెల్ కోసం మళ్ళీ వెతికాను. మొదట ఎంత వెతికినా కనిపించని పార్సెల్ రెండోసారి వెతికినప్పుడు దొరికింది. ఆ ఫాదరీ ఇచ్చిన అడ్రసుకే దాన్ని పోస్టు చేశాను. అడ్రసేమిటో నాకు గుర్తులేదు గానీ వెస్టు మినిస్టర్లో ఏదో వీధి పేరిచ్చినట్టు జ్ఞాపకం. అదేదో చాలా ముఖ్యమైన విషయంలా వుంది. అందుకే పోలీసులు వచ్చినట్టున్నారు" అంది.

"అవునవును. హేంప్‌స్టెడ్ హీత్ ఇక్కడికి దగ్గరేనా?" అనవసరంగా మాటపొడిగించకుండా క్లుప్తంగా అడిగాడు వాలెంటిన్.

"నేరుగా వెళ్తే పదిహేను నిమిషాలు" చెప్పిందామె.

వాలెంటిన్ ఒక్కసారిగా ఆ షాపులోంచి బయటికి దూకేసి వేగంగా పరిగెత్తనారంభించాడు. ఆ ఇద్దరు పోలీసు అధికారులు అయిష్టంగానే అతనివెంట దౌడుతీయటం మొదలెట్టారు.

ఆ విధంగా పరిగెత్తుకుంటూ వెళ్ళి ఆ ఇరుకు సందులోంచి బయటపడేసరికి అనుకోకుండా వాళ్ళకు నందనోద్యానవనం లాంటి సువిశాలమైన లోయప్రాంతం ఎదురైంది. అదే హేంప్‌స్టెడ్ హీత్. జనం ఆ ప్రదేశానికి వ్యాహ్యాళికోసం వస్తుంటారు. అంతవరకూ వాళ్ళు ముగ్గురూ ఎలాంటి చీకటి సందుల్లోంచి వచ్చారంటే, వాటిలోంచి బయటపడేసరికి సూర్యుడు ఇంకా పూర్తిగా అస్తమించలేదని తెలుసుకొని బోలెడు ఆశ్చర్యపోయారు. మేలిమి బంగారు రంగులో సాయం సంధ్య పచ్చని చెట్ల గుబుర్లలోకి క్రమంగా దిగివస్తోంది. నిశాసుందరి నడుముకు పసిడివడ్డాణం పెట్టుకున్నట్టుగా ఆ స్వర్ణరేఖ నలువైపులా గోచరిస్తుంది. పైన ఆకాశంలో నునులేతగా అప్పుడప్పుడే చీకట్లు అలుముకుంటున్నాయి. ఆ నలుపులోంచి అప్పుడే రెండు మూడు నక్షత్రాలు బద్ధకంగా ముసుగు తొలగించుకుని నేలవైపు తొంగిచూస్తున్నాయి. చీకట్లు ముసురుకుంటున్నా అక్కడ సరదాగా గడపడానికొచ్చిన జనం ఇంకా పూర్తిగా పలచబడలేదు. బెంచీల మీద ఒకటీ అరా జంటలు అస్పష్టంగా కనిపిస్తున్నారు. ఎక్కడో చెట్లకొమ్మల్లో ఉయ్యాలలూగుతున్న ఆడపిల్లల కేరింతలు ఉండి వుండి కీచుమంటూ వినిపిస్తున్నాయి. ప్రకృతి సౌందర్యం క్రమంగా చీకటి కౌగిలిలో ఒదిగిపోతూ తనతోపాటు మనుషుల ఆకారాల మీద కూడా నల్లని తెరలు కప్పేస్తోంది. ఆ మసక వెలుతుర్లో వాలెంటిన్ కళ్ళకు తను వెతుకుతున్నదేమిటో ఎదురుగానే కనిపించింది.

ఆ లోయలో క్రమంగా చీకట్లో కరిగిపోతున్న మానవాకారాల మధ్య రెండు ఆకారాలు అతనికి విస్పష్టంగా కనిపిస్తున్నాయి. అంతెత్తు నుంచి చీమల్లా కనిపిస్తున్నప్పటికీ ఆ ఇద్దరు వ్యక్తులు ఫాదరీల దుస్తుల్లో వుండడం వాలెంటిన్ గమనించగలిగాడు. ఆ ఇద్దర్లో ఒకతను రెండో వ్యక్తి కంటే చాలా పొట్టిగా వున్నాడు. ఆ రెండో వ్యక్తి మాత్రం ఆరడుగులకు మించే ఎత్తుండవచ్చు. వాలెంటిన్ పళ్ళు బిగబట్టి అసహనంగా చేతికర్ర తిప్పుకుంటూ ముందుకు కదిలాడు. తమ మధ్య దూరం తగ్గిపోయి వాళ్ళిద్దరూ తనకు భూతద్దంలో చూసినంత స్పష్టంగా కనిపించే సమయానికి ఆకస్మాత్తుగా అతనికేదో తెలిసినట్టై అంతులేని విస్మయంలో మునిగిపోయాడు.

సదరు ఆరడుగుల శాల్తీ ఎవరైనా కానివ్వు గాక, అతని పక్కనే వున్న ఆ పొట్టి ఫాదరీని గుర్తుపట్టడంలో మాత్రం తాను పొరపాటు పడలేదు. చిత్రమేమిటంటే అతన్ని చూసి తానెంత ఆశ్చర్యపోయినప్పటికీ ఎక్కడో అంతరాంతరాల్లో ఈ విషయం ముందుగానే వూహించిన అనుభూతి కలుగుతోంది.

ఆ పొట్టి ఫాదరీ ఎవరో కాదు, ఆ ఉదయం తనకు తటస్థపడిన రైలు మిత్రుడు!

బ్రౌన్ పేపరు పార్సెళ్ళ విషయంలో తాను జాగ్రత్త చెప్పిన అమాయక చక్రవర్తి!!

ముగింపు వచ్చేవారం.

**మాస్టారూ!**

"మాస్టారూ!... ఈ రోడ్‌లో వెళితే గవర్నమెంటు హాస్పటల్ వస్తుందా!?"


"రాదండి... కష్టం."

"పోనీ... హాస్పటల్ దగ్గరికి వెళ్ళాలంటే ఎటు వెళ్ళాలో చెబుదురూ!"

"అయితే... ఈ రోడ్ సరాసరి వెళ్ళండి."

"అదేంటండీ... ఇందాక అడిగితే హాస్పటల్ రాదు అన్నారు?"

"అవునండి హాస్పటల్ రాదు... మనమే హాస్పటల్ దగ్గరికి వెళ్ళాలి."



# డిటెక్టివ్ కథలు

జి.కె. చెస్టర్టన్

## నీలం శిలువ

దాదా హయాత్

(గత సంచిక తరువాయి)

నెమ్మదిగా అతనికి జరిగిందేమిటో అర్థం కాసాగింది.

ఆ ఉదయం తను చేసిన ఎంక్వైరీలో ఫాదర్ బ్రౌన్ అనే వ్యక్తి ఎసెక్స్ నుంచి నీలాలు పొదిగిన వెండి శిలువొకటి తెస్తున్నాడని తెలిసింది. క్రైస్తవ మహాసభలకు హాజరయ్యే విదేశీ ఫాదరీలకు చూపించడం కోసం ఆ నీలం శిలువను పట్టుకొస్తున్నాడతను. చాలా విలువైన నీలం శిలువ.

అయితే ఫాదర్ బ్రౌన్ మరెవరో కాదన్న మాట! తనకు రైల్లో తగిలిన తెలివితక్కువ పెద్ద మనిషి. అతను తన దగ్గరుందని చెప్పుకున్న ఖరీదైన వెండి వస్తువు ఆ నీలం శిలువే అవడంలో ఎలాంటి సందేహం అవసరం లేదు.

తను ఎంక్వైరీ చేస్తే తెలిసిన విషయం ఫ్లాంబ్యూకి కూడా తెలిసిపోవడంలో విడ్డూరమేం లేదు. ఫ్లాంబ్యూకి అన్ని సంగతులూ తెలుస్తాయి. సదరు విలువైన నీలం శిలువ గురించి వింటూనే దాన్ని తస్కరించడానికి ఫ్లాంబ్యూ పథకం వేయడంలో కూడా విడ్డూరమేం లేదు. అది అత్యంత సహజమైన విషయమని ఫ్లాంబ్యూ చరిత్ర గురించి తెలిసినవారెవరైనా చెప్పేయగలరు.

ఇక ఫాదర్ బ్రౌన్ లాంటి వెర్రిగొర్రెని బురిడీ కొట్టించడం ఫ్లాంబ్యూకి చిటికెన వేలితో సమానం. చంకలో గొడుగు పెట్టుకు తిరిగే ఆ అమాయక జీవిని కావాలంటే ముక్కుకు తాడేసి ఉత్తర ధృవందాకా ఎవరైనా తీసుకెళ్ళొచ్చు. అలాంటిది ఫ్లాంబ్యూలాంటి గుంటనక్క తనూ ఓ పాదరీలా నటిస్తూ అతన్ని హాంప్ స్టెడ్ హీత్ దాకా తీసుకురాగలగడంలో ఆశ్చర్యమేముంది?

అంతవరకు బాగానే వుంది. ఫాదర్ బ్రౌన్ మీద తనకు బోలెడు జాలికూడా వేస్తోంది. అలాంటి అమాయకజీవిని వంచిస్తున్న ఫ్లాంబ్యూ మీద పట్టరాని ఆగ్రహమూ కలుగుతోంది.

అయితే, ఎక్కడో ఏదో లింకు మిస్సవుతోంది.

ఫ్లాంబ్యూ ఎక్కడున్నాడో తెలుసుకోవడంలో తను ఘనవిజయం సాధించాడు, నిజమే. అయితే ఆ విజయానికి దారితీసిన సంఘటనలకు అర్థమేమిటన్నది మాత్రం అతనికెంత బుర్ర బద్దలుకొట్టుకున్నా తెలియడంలేదు.

ఆ నీలం శిలువకూ గోడమీద పారబోసిన సూపుకూ సంబంధమేమిటి? నారింజపళ్ళు వేరు శనక్కాయలు కావడానికీ, వేరు శనక్కాయలు నారింజ పళ్ళవటానికీ మతలబేమిటి? తను వేట చరమాంకానికైతే చేరుకోగలిగాడు. కానీ మధ్యలో జరిగిన అంకాలను మాత్రం మిస్సయ్యాడు. తన అనుభవంలో సరైన క్లూ దొరికినా అపరాధి తప్పించుకోవడం చూశాడు. ఇక్కడ అపరాధి దొరికాడు — క్లూ మాత్రం చేతికందకుండా తప్పించుకుంది.

ఎదురుగా కనిపిస్తున్న ఆకారాలు రెండూ ఇప్పుడు నెమ్మదిగా అవతలివైపు కొండమీదికి ఎగబాకుతున్నాయి. మాటల్లో పడ్డారు కాబోలు, ఎటు వెళ్తున్నారో వాళ్ళిద్దరికీ తెలుస్తున్నట్టుగా లేదు. వాళ్ళు వెళ్తున్న మార్గం ఇంకా దట్టమైన చెట్ల గుబుర్లోకి దారితీస్తోంది.

వాలెంటిన్ తన అనుచరుల్ని వెంటేసుకుని ఆ ఇద్దర్నీ వేటగాడికి మల్లే వెంబడిస్తున్నాడు, లేడిని పట్టాలంటే చెట్టుచాటుగా గుట్టు చప్పుడు కాకుండా ముందుకు సాగాలి. అవసరమైతే ఒత్తుగా పెరిగిన గడ్డిలో బోర్లా పడుకుని కొద్ది కొద్దిగా అవతలికి పాకాలి. ప్రస్తుతం వాళ్ళు చేస్తున్న పనదే. కాసేపటి తర్వాత దూరం నుంచే ఆ ఇద్దరూ మాట్లాడుకోవడం అస్పష్టంగా వినిపించనారంభించింది వాళ్ళకు. అయితే, 'హేతువాదం' అనే మాట తప్ప ఇంకేదీ సరిగ్గా చెవిన పడలేదు.

అంతలోనే ఆ ఇద్దరు ఫాదరీలు ఓ చెట్లగుబుర్లోకి మళ్ళీ అకస్మాత్తుగా అదృశ్యమైపోయారు. వాలెంటిన్ కంగారుపడిపోయాడు. నానా హైరానాపడి పదినిమిషాలపాటు గాలించాకగానీ ఆ ఇద్దరి జాడ మళ్ళీ అందిపుచ్చు లేక పోయాడు.

ఈసారి ఆ ఇద్దరు ఫాదరీలు కొండశిఖరం మీద దర్శనమిచ్చారతనికి. అవతలివైపు పల్లంలో సూర్యుడు అస్తమిస్తున్న దృశ్యం మనోద్భుతంగా వుంది. ఆ ఇద్దరు తప్ప అక్కడ ఇంకెవరూ లేరు. నేలమీద పడున్న ఓ దుంగ మీద బైఠాయించి ఏదో విషయం గురించి సీరియస్‌గా చర్చించుకుంటున్నారు వాళ్ళు.

సంజకెంజాయ ఇంకా పూర్తిగా పలచబడలేదు. అయితే పైన బ్రహ్మాండమైన గోళాకారంలో వున్న ఆకాశం అప్పటికే బాగా నల్లబారింది. అంతవరకు పచ్చగా వున్న ఆ ప్రదేశంతా ఇప్పుడు

నలుపురంగులోకి మారుతోంది. ఆకాశంలో నక్షత్రాలు మరింత స్వేచ్ఛగా దిగివచ్చి దివ్యమణుల్లా ప్రకాశిస్తున్నాయి. వాలెంటిన్ తన అనుచరులిద్దరికీ నిశ్శబ్దంగా వుండమని సైగచేసి ఆ ఫాదరీలకు సమీపంలో వున్న ఓ పెద్ద చెట్టు చాటుకి చేరుకున్నాడు. వాళ్ళ మాటలు ఇప్పుడు స్పష్టంగా వినిపిస్తున్నాయతనికి.

ఒకటి రెండు నిమిషాలపాటు వాళ్ళ మాటలు శ్రద్ధగా ఆలకించాక వున్నట్టుండి పెద్ద ధర్మసందేహంలో పడిపోయాడతను. ఆ ఇద్దరూ సరిగ్గా మతగురువుల్లాగే మాట్లాడుకుంటున్నారు.

పొట్టి ఫాదరీ ఆకాశంలోని నక్షత్రాలకేసి చూస్తూ మాట్లాడుతున్నాడు. పొడుగు ఫాదరీ తల వంచుకుని శ్రద్ధగా ఆ మాటలు ఆలకిస్తున్నాడు. అంతకంటే పవిత్రమైన సంభాషణ ఈ భూప్రపంచం మీద మరెక్కడా జరగదు.

"... పరలోకంలో చెడుకు తావు లేదని మధ్యయుగం ప్రజలు భావించిందానికి అర్థం అదే," తను చెబుతున్న విషయానికి ముక్తాయింపు పలుకుతూ అంటున్నాడు ఫాదర్ బ్రౌన్.

రెండో ఫాదరీ అలా తల వంచుకునే బుర్రూపాడు.

"అవును, ఆధునికులు హేతువాదాన్ని పట్టుకు వేలాడుతున్నారు. భగవంతుడి సృష్టిలో ఇంకా ఎన్నివేల అద్భుతలోకాలున్నాయో ఎవరికి తెలుసు? ఆ లోకాలకు వెళ్ళగలిగితే వీళ్ళ హేతువాదం మట్టికరుస్తుంది," అన్నాడు.

"కాదు," చెప్పాడు ఫాదర్ బ్రౌన్. "హేతువాదం ఎప్పటికీ హేతువాదమే. చర్చికీ హేతువాదానికీ చుక్కెదురని చెప్పే వాళ్ళవాదన సరైంది కాదు. నిజానికి చర్చి ఒక్కటే ఈ భూమ్మీద హేతువాదానికి పెద్దపీట వేస్తోంది. సాక్షాత్తు ఆ భగవంతుడే హేతువుకు కట్టుబడి వున్నాడని వాక్కు చెబుతోంది," అన్నాడు.

చెట్టు వెనక నిలబడ్డ వాలెంటిన్ తనని తాను తిట్టుకుంటున్నాడు. అంత కష్టపడి తానిక్కడికి చేరుకున్నది ఈ ధర్మోపదేశాలు వింటానికేనా? అనవసరంగా ఇద్దరు పోలీసు ఉద్యోగుల్ని ఇందులోకి దింపి ఫూలైపోయాడు. పులి అనుకుని వేటాడవస్తే ఎదురైంది పునుగుపిల్లి.


రెండో ఫాదరీ ఈసారి ఆకాశంవైపు మొహం తిప్పాడు.

"ఈ అనంత విశ్వంలో...," అంటూ ఇంకా ఏదో అనబోతున్నాడు.

"విశ్వం అనంతమైనదనే మాట కేవలం భౌతికవాదం మాత్రమే," అతని మాటకు అడ్డొస్తూ మరుగ్గా అన్నాడు ఫాదర్ బ్రౌన్. "సత్యం ఒక్కటే అనంతమైనది. దాన్నుంచి తప్పించుకునే మార్గం లేదు."

వాలెంటిన్ చెట్టువెనక గోళ్ళు కొరుక్కుంటూ లోలోపలే రగిలిపోనారంభించాడు. తన వెంటవచ్చిన పోలీసు ఉద్యోగుల్లు ఆ ఫాదరీల సోది విని ప్రగాఢంగా నిట్టూర్పులు విడవడం అతనికి కర్ణాకర్ణిగా వినిపిస్తూనే వుంది. ఫాదర్ బ్రౌన్ చెప్పిన మాటలకు పొడుగు ఫాదరీ ఇచ్చిన జవాబేమిటో ఆ గుండెమంటలో అతని బుర్రకెక్కనే లేదు. అతను తిరిగి సర్దుకుంటూ చెవులు రిక్కించుకునేసరికి ఫాదర్ బ్రౌన్ మళ్ళీ అంటున్నాడు—

"సత్యానికీ హేతువాదానికీ కట్టుబడనిదంటూ ఏదీ లేదు. ఆకాశంలో సుదూర నక్షత్రాన్ని కూడా హేతువాదం స్పృశించి తీరుతుంది. పైన మెరుస్తున్న నక్షత్రాలను నువ్వు వజ్రాలనుకోవచ్చు. ఈ అడివిలోని చెట్ల ఆకుల్ని పుష్పాలనుకోవచ్చు. దేదీప్యమానంగా ప్రకాశిస్తున్న ఆ చందమామను దివ్యమణి అనుకోవచ్చు నీ ఇష్టప్రకారం నువ్వేమైనా అనుకోవచ్చు. అయితే సత్యం మాత్రం మారదు. నక్షత్రాలు నక్షత్రాలే. చందమామ చందమామే. ఆ వజ్రాల సందిళ్ళకింద, ఆ పచ్చల పొదరిళ్ళ వెనక, ఆ నీలాలతోరణాల లోపల నీకంటికి కనిపించని



బోర్డు ఒకటి వేలాడుతోంది— 'నీవు దీనిని దొంగిలించలేవు' ''

వాలెంటిన్‌కు సహనం చచ్చిపోయింది. ఫాదర్ బ్రౌన్ ఇచ్చిన తలాతోకాలేని ఉపన్యాసంతో అతనికి పిచ్చెక్కినట్టయ్యింది. జీవితంలో తను చేసిన అతి పెద్ద పొరపాటు పనీపాటలేని ఈ మతగురువుల్ని వెంబడించుకుంటూ ఇక్కడికి చేరుకోవడమే అనిపించింది. ఎంత నిశ్శబ్దంగా అక్కడికొచ్చాడో అంత నిశ్శబ్దంగా అక్కడ్నించి వెనుదిరగడానికి నిస్పృహతో సిద్ధపడుతున్నాడు.

అయితే, ఎందుకో అతనికే తెలీదు—

పొడుగు ఫాదరీ మౌనం వహించడంతో అక్కడ వ్యాపించిన నిశ్శబ్దంలో ఏదో దాగివున్నట్టనిపించి వెనక్కి మళ్ళకుండా నిలబడిపోయాడు. అతనేం చెప్పబోతున్నాడో వింటానికి చెవులు ఇంకా రిక్కించుకున్నాడు.

ఆ పొడుగు ఫాదరీ వంచిన తల పైకెత్తకుండా ఇంకా అలాగే కూర్చున్నాడు. అతని రెండు చేతులూ మోకాళ్ళమీద విశ్రాంతి తీసుకుంటున్నాయి. చివరికి నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ చాలా సాఫీగా అన్నాడు—

''నువ్వేమైనా చెప్పు. పరలోకం మానవమాత్రుడి శుష్క హేతువాదానికి అందనంత ఎత్తులో వున్నదనే నా అభిప్రాయం. స్వర్గలోకంలో మనకు అంతుపట్టని మిస్టరీ ఏదో వుంది. ఆ మహిమాన్వితమైన పరలోకానికి ఇదే నేను తల వంచి నమస్కరిస్తున్నాను.''

లాభం లేదు. ఇంకా తనిక్కడే నిలబడితే వీళ్ళు తన మెదడు తినేస్తారు. వాలెంటిన్ వెనక్కి తిరిగాడు. అయితే అడుగు ముందుకుపడే లోపలే అదిరిపడి ఆగిపోయాడు.

పొడుగు ఫాదరీ అలా తలవంచుకునే, గొంతులో ఏమాత్రం తేడా లేకుండా ఇంకా ఇలా అన్నాడు—

''ఏదీ, ఆ నీలం శిలువ ఇలా ఇచ్చెయ్. లేదంటే, ఇక్కడున్నది మనిద్దరమే, నిన్ను ముక్కలుచేసి అవతల పారేయగలను.''

గొంతు సాఫీగానే వుంది. కానీ, మాట మారిపోయింది. అదే వాలెంటిన్‌కు ఒక్కసారిగా ఒళ్ళు గగుర్పొడిచేలా చేసింది.

విచిత్రమేమిటంటే ఫాదర్ బ్రౌన్ కొంచెం కూడా తొణకలేదు. అసలా మాట అతని బుర్రకెక్కలేదో లేక ఆ మాట వినగానే భయంతో బిర్రబిగుసుకుపోయాడో తెలీదు. అతని అమాయకమైన మొహం ఆకాశంలోని నక్షత్రాలవైపు నుంచి అణుమాత్రం కూడా పక్కకు తిరగలేదు.

ఫాదరీ వేషంలో వున్న ఆ వ్యక్తి ఇంకా సాఫీగానే అన్నాడు—

''నేనెవరో తెలుసా? ఫ్లాంబ్యూని.''

ఫాదర్ బ్రౌన్ అప్పటికీ మాట్లాడలేదు.

కొద్ది క్షణాలు నిశ్శబ్దం తర్వాత ఫ్లాంబ్యూ మళ్ళీ అన్నాడు—

''కమాన్, ఆ శిలువనిలా ఇచ్చెయ్.''

''ఇవ్వను,'' అన్నాడు ఫాదర్ బ్రౌన్.

అతని గొంతు విచిత్రంగా ధ్వనించింది.

ఫ్లాంబ్యూ అకస్మాత్తుగా మేకవన్నె వదిలించుకుంటున్న పెద్దపులిలా బయటపడిపోతూ తల వెనక్కి వంచి బిగ్గరగా నవ్వాడు.

''ఇవ్వవా? అవును, నువ్వు ఇవ్వలేవు— నాకు తెలుసు. ఎందుకో చెప్పనా? ఆ నీలం శిలువ ఇప్పుడు నా జేబులో వుంది,'' అన్నాడు విజయ గర్వంతో.

ఫాదర్ బ్రౌన్ నెమ్మదిగా అతని వైపు మొహం తిప్పాడు.

''నిజంగా?''

''ఏం, అనుమానమా? నీ దగ్గరున్న బ్రౌన్ పేపరు పార్సెల్ లాంటిదే నేనూ ఒక పార్సెల్ తెచ్చాను. ఇప్పుడు నీ దగ్గరున్నది ఆ నకిలీ పార్సెల్. అసలు పార్సెల్ నా దగ్గరుంది. దొంగతనం చేయడంలో ఇది చలా పాత పద్ధతి మై ఫ్రెండ్.''

ఫాదర్ బ్రౌన్ తమాషాగా బుర్ర గోక్కున్నాడు.

''అవును, ఆ పద్ధతి నాకూ తెలుసు,'' అన్నాడు.

ఫ్లాంబ్యూ కళ్ళల్లో ఆసక్తి తొంగి చూసింది.

''అది నీకెలా తెలుసు?''

''ఖైదీ ఒకతను చెప్పాడు. అఫ్‌కోర్స్, అతని పేరేమిటో నీకు చెప్పకూడదనుకో. దాదాపు ఇరవై ఏళ్ళు అలాంటి నకిలీ పార్సెళ్ళ మీదే బతికాడతను. చివరికి పట్టుబడి జైలుకు వెళ్ళాడు. నేను ఫాదరీని కదా, తను చేసిన పాపాలన్నీ కన్ఫెషన్ కింద నాకు చెప్పుకున్నాడు. నీమీద అనుమానం కలుగుతూనే నాకు మొట్టమొదట గుర్తుకొచ్చింది అతను చెప్పిన పార్సెళ్ళ మార్పిడే.''

ఫ్లాంబ్యూ అతన్ని గుడ్లప్పగించి చూశాడు.

''నువ్వు నన్ను అనుమానించావా?!!! ఎప్పుడు?''

''మొదటిసారి నిన్ను చూసినప్పుడే నాకు అనుమానం వచ్చింది. అందువల్ల ఎలాగైనా సరే నా పార్సెల్‌ని కాపాడుకోవాలనుకున్నాను. నువ్వు తెలివిగా పార్సెళ్ళు మార్చేశావు, బాగానే వుంది. కానీ, ఆ పార్సెళ్ళు నేను మళ్ళీ మార్చేశాను. అదే నువ్వు పసిగట్టలేకపోయావ్. అసలు పార్సెల్‌ని నేనో చోట వదిలేసొచ్చాను.''

''వాట్?!!!''

''అవును. నీకా మిఠాయి అంగడి గుర్తుందా? నా పార్సెల్ ఒకటి అక్కడ వదిలేశాననే మిష మీద నేను మళ్ళీ లోపలికి వెళ్ళాను. నిజానికి నేనక్కడ పార్సెలేదీ వదిలిపెట్టలేదు. అయితే ఆ పని రెండోసారి అక్కడినుంచి వచ్చేసేటప్పుడు చేశాను. ఆ నీలం శిలువ వున్న పార్సెల్ నిజంగానే అక్కడ వదిలేశాను. అది కనబడితే నా మిత్రుడి అడ్రసుకు పోస్టు చేయమని చెప్పేసొచ్చాను. అదీ పాటికి వెస్టుమినిస్టర్లో వున్న నా మిత్రుడి అడ్రసుకు పోస్టులో బయల్దేరే వుంటుంది.''

ఆ మాట చెబుతుండగా ఫాదర్ బ్రౌన్ గొంతులో విచారం తొంగి చూసింది.

''ఈ ఉపాయం కూడా పాపం ఓ మాజీ నేరస్తుడి దగ్గరే నేర్చుకున్నాను. అతను కూడా రైల్వే స్టేషన్లలో హేండ్ బ్యాగులు దొంగిలించి

## జంటలు



యం.జి.రామచంద్రన్, బి.సరోజాదేవి తమిళ రంగంలో హిట్ జంటగా పేరు తెచ్చుకున్నారు. శివాజీ గణేశన్ పద్మిని, ఇటీవల రజనీకాంత్, శ్రీప్రియ, కమల్‌హాసన్ శ్రీదేవి సూపర్‌హిట్ జంటలుగా పేరు తెచ్చుకున్నారు.

ప్రస్తుతం శివాజీ కుమారుడు ప్రభు, కుష్బూ హిట్ జంటగా పేరుతెచ్చుకున్నారు.

"గాడిద ఈఆలా! అదేం పాడుగోల?" అడిగాడు ఫ్లాంబ్యూ.

"అయితే నీకు గాడిద ఈఆల అనే విద్య గురించి తెలీదన్నమాట! పోన్లే, అదీ ఒకందుకు మంచిదే అయ్యింది. ఆ విద్య నువ్వు ప్రయోగించి వుంటే నేను ఎదిరించలేకపోయేవాడిని. మహా చెడ్డ విద్య అది. నాకూ ముద్దర్లు అనే విద్య గురించి తెలుసుగానీ కళ్ళలో సత్తువ లేదు."

"నువ్వేం మాట్లాడుతున్నావో నాకు ఒక్క ముక్క అర్థం కావడంలేదు," జుట్టు పీక్కుంటూ అన్నాడు ఫ్లాంబ్యూ.

"అయితే నీకు ముద్దర్లగురించి కూడా తెలీదన్న మాట! నువ్వేం గజదొంగవి?" అన్నాడు ఫాదర్ బ్రౌన్.

"మైగాడ్! ఈ కాకిగోలంతా నువ్వెలా నేర్చుకున్నావ్?" వాపోయాడు ఫ్లాంబ్యూ.

ఫాదర్ బ్రౌన్ మోములో సన్నని దరహాసం తొంగిచూసింది.

"బహుశా నేను మొద్దావతారంలా కనబడబట్టి అనుకుంటాను. అయినా ఇతరుల పాపాల గురించి వినడం తప్పిస్తే మరింకేం చేయని వ్యక్తి పూర్తిగా అమాయకుడు కాలేడని నీకెప్పుడూ తట్టలేదా?" అన్నాడు.

"ఓహ్! అన్నాడు ఫ్లాంబ్యూ తల పట్టుకుంటూ.

"అదొక్కటే కాదు, మరో విధంగా కూడా నువ్వు ఫాదరీవి కావడానికి వీల్లేదని నేను పసిగట్టగలిగాను," చెప్పాడు ఫాదర్ బ్రౌన్.

"ఎలా?"

"నువ్వు హేతువాదం మీద విరుచుకు పడ్డావు. నిజంగా ధర్మశాస్త్రం గురించి తెలిసిన ఫాదరీవే అయ్యుంటే అలా అడ్డంగా వాదించేవాడివే కాదు."

ఫాదర్ బ్రౌన్ తన గొడుగు కోసం అటూ ఇటూ చూస్తుండగానే వాలెంటిన్ తన అనుచరులతో సహా చెట్టు చాటునుంచి బయట పడ్డాడు.

ఫ్లాంబ్యూ మహా చతురుడు. అతను బయటికి వస్తూనే తలవంచి అభివాదం చేశాడు.

"నువ్వు తలవంచాల్సింది నాక్కాదు మై ఫ్రెండ్," చెప్పాడు వాలెంటిన్. "మనిద్దరం మన గురువుకు నమస్కరించాలి."

వాళ్ళిద్దరూ తనకు అభివాదం చేస్తుండగా గొడుగు చంకన పెట్టుకుని కళ్ళార్పుతూ అమాయకంగా చూశాడు ఫాదర్ బ్రౌన్.

— వచ్చేవారం మరో డిటెక్టివ్ కథ.

## మీకు తెలుసా?

ప్రపంచంలోకెల్లా అత్యంత పరిశుభ్రమైన నీరు కల్గిన నది— మన గంగానది మాత్రం కాదు... అమెజాన్ నది. ఇది సముద్రంలో కలిసే చోట దాదాపు 100 మైళ్ళవరకూ సముద్రపు నీరు స్వచ్ఛంగా తియ్యగా ఉంటుంది. శాస్త్రజ్ఞుల అభిప్రాయం ప్రకారం అమెజాన్ నదిలో నీరు... డిస్టిల్డ్ వాటరంత పరిశుభ్రంగా ఉంటుంది.

ఫ్యాషన్లకు పుట్టినిల్లయిన ప్యారిస్ నగరంలో... ముస్లిం యువతులు కొందరు కాలేజీలకు, మ్యాక్సీలకు బదులు ముస్లిం యువతులు పూర్తిగా ఒంటి నిండా ముసుగు వెయ్యడాన్ని అనుమతించాలని పెద్ద ఎత్తున బంద్ నిర్వహించారు. క్షణానికో ఫ్యాషన్తో విరాజిల్లే ప్యారిస్ నగరంలో యిలాంటి సమ్మెలు జరగటం వింతగా ఉంది కదండీ.

ముద్దా విజయలక్ష్మి

రైనా గొడవ చేస్తారు. అలాగే తిన్న దానికి హోటల్లో మూడింతలు బిల్లువేస్తే ఎవరూ వూరుకోరు. ఊరుకున్నారంటే మాత్రం వాళ్ళు వలుగురి దృష్టి తమ మీద పడకుండా దేనికోసమో గుట్టుచప్పుడు కాకుండా వుండిపోయారని అర్థం. మనం మొదటిసారి కాఫీ తాగిన రెస్టారెంట్లో ఉప్పూ చక్కెర నేను తారుమారు చేశాను. రెండోసారి బిల్లు మార్చేశాను. రెండుసార్లూ నువ్వు తేలుకుట్టిన దొంగలా వుండిపోయావు. ప్రాణం బిగబట్టుకుని ఉప్పు కాఫీ తాగేశావు. బిల్లు మూడింతలైనా కిమ్మనకుండా కట్టేశావు. దాంతో నా అనుమానం ధృవపడిపోయింది."

ఫ్లాంబ్యూకి తలతిరిగిపోతోంది. ఏదో మంత్రానికి కట్టుబడిపోయినవాడిలా నేస్తులు దక్కి ఫాదర్ బ్రౌన్ చెబుతున్నది వింటుండిపోయాడు.

"నీకు తెలియకుండానే నీజాడ పోలీసులకు తెలియజేయాల్సి వచ్చింది. అందుకే మనం ఎక్కడికి వెళ్తే అక్కడ ఏదో ఒక తుంటరిపని చేసి అక్కడున్న వాళ్ళు ఎవరికీ పెద్ద నష్టం కలిగించలేదనుకో. ఓ చోట సూపు గోడమీద పారబోశాను. ఇంకో చోట ఆపిల్ పళ్ళు నేలపాలు చేశాను. మరోచోట కిటికీ అద్దం పగలగొట్టాను. ఏది ఏమైనా శిలువని మాత్రం రక్షించుకోగలిగాను. భగవంతుడెప్పుడూ శిలువని కాపాడతాడు. అదిప్పుడు వెస్టుమినిస్టర్లో సురక్షితంగా వుంది. అవన్నట్టు గాడిద ఈఆల చేసి నువ్వు తప్పించుకోకపోయావేం?" అన్నాడు ఫాదర్ బ్రౌన్.

అదే పద్ధతిలో తన మిత్రుడి అడ్రసుకు వాటిని పోస్టులో పంపేవాడు. ఇప్పుడు అతనో మొనాస్టరీలో వుంటున్నాడు. వాళ్ళాంటి ఫాదరీలు అలాంటి విషయాలు వినక తప్పదు. జనం మా దగ్గరికొచ్చి చేసిన పాపాలు చెప్పుకుంటూ వుంటారు," ఇంకా అలా తమాషాగా బుర్రగోక్కుంటూనే అన్నాడు.

ఫ్లాంబ్యూ గబుక్కున తన జేబులోంచి ఓ బ్రౌన్ పేపరు పార్శెలు బయటకి తీశాడు. విప్పి చూసేసరికి కొంత కాగితం తుక్కు, కొన్ని సీసం కడ్డీలు అందులోంచి బయటపడ్డాయి. దాంతో అతను దిగ్గున లేచి నిలబడిపోయాడు.

"నెవ్వమ్మను, నీలాంటి వాజమ్మ అంత తెలివి చూపించడం అసాధ్యం. ఆ శిలువింకా నీ దగ్గరే వుంది. మర్యాదగా ఇవ్వకపోయావో, జాగ్రత్త! మనం ఇక్కడ ఒంటరిగా వున్నామనే సంగతి మర్చిపోవద్దు. బలవంతంగా అయినా సరే, అది నీ దగ్గర్నుంచి రాబట్టగలను," అన్నాడు కరుగ్గా.

ఫాదర్ బ్రౌన్ నెమ్మదిగా లేచి నిలబడ్డాడు.

"లేదు, బలవంతంగా నువ్వా శిలువ నా దగ్గర్నుంచి రాబట్టలేవు. మొదటి సంగతి— అది నా దగ్గర నిజంగానే లేదు. రెండో సంగతి— మనమిక్కడ ఒంటరిగా లేము," అన్నాడు.

ఫ్లాంబ్యూ అడుగు ముందుకు వేయబోతున్నవాడల్లా ఆ మాట వింటూనే అదిరిపడి ఆగిపోయాడు.

"ఆ చెట్టు వెనక ముగ్గురు మనుషులున్నారు," చెప్పాడు ఫాదర్ బ్రౌన్. "ఇద్దరు సహిల్వార్లవంటి పోలీసాఫీసర్లు. మూడో వ్యక్తి ఈ ప్రపంచంలోకెల్లా గొప్ప అపరాధ పరిశోధకుడు."

చెట్టు చాటునుంచి అంతా వింటూనే వున్న వాలెంటిన్ ఒక్కసారిగా అంతులేని విస్మయంలో మునిగిపోయాడు.

ఫాదర్ బ్రౌన్ ఇంకా చెబుతున్నాడు—

"వాళ్ళు ముగ్గురూ ఇక్కడికెలా వచ్చారంటావా? నేనే వెంట తెచ్చుకున్నాను. అదెలాగో చెబుతాను. మొట్టమొదట నీ మీద అనుమానం కలుగుతూనే నా అనుమానం నిజమో కాదో తెలుసుకోవలసిన అవసరం కనిపించింది నాకు. నిన్ను అనుమానించడంలో నేను పొరపాటుపడి వుంటే అనవసరంగా తోటి ఫాదరీని అవమానించినవాడినవుతాను. అందుకే నీకో చిన్న పరీక్ష పెట్టాను.

"కాఫీలో ఉప్పు కలిస్తే సాధారణంగా ఎవ